క్లుప్తంగా

షాద్‌నగర్ రూరల్ సీఐగా వెంకట్‌రెడ్డి



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్‌రెడ్డి

షాద్‌నగర్: షాద్‌నగర్ రూరల్ సీఐగా వెంకట్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన డీకే లక్ష్మి రెడ్డి హైదరాబాద్ రేంజ్ జోన్‌కు బదిలీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో విధుల్లో ఉన్న వెంకట్‌రెడ్డిని షాద్‌నగర్ రూరల్ సీఐగా సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో షాద్‌నగర్ రూరల్ సీఐగా లక్ష్మీరెడ్డి నుంచి వెంకట్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు



ర్యాలీ ప్రారంభిస్తున్న సీఐ సైదులు

శంకర్‌పల్లి: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు పేర్కొన్నారు. బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులతో పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొదని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ రావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి కంప్యూటర్ అందజేత



సర్పంచ్ రత్నంకు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేస్తున్న ప్రొఫెసర్లు

మొయినాబాద్: మోత్కుపల్లి గ్రామ పంచాయతీకి విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు బుధవారం సర్పంచ్ రత్నంకు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు అరుణకుమారి, వెంకటేశ్వర్లు మోత్కుపల్లి గ్రామాన్ని సందర్శించారని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిపై పలు అంశాలను సర్పంచ్ రత్నం దృష్టికి తెచ్చారు.

పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు

కొందుర్గు: విద్యార్థులు లక్ష్యం, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధించొచ్చని మోటివేషనల్ స్పీకర్ శ్రీసేవ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలోని జీఎం పటేల్ గార్డెన్‌లో పదోతరగతి విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో చదువును భారంగా ఊహించుకోవద్దన్నారు. శ్రద్ధగా, ఇష్టంతో చదవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కొందుర్గు జెడ్పీహెచ్ఎస్, గురుకుల పాఠశాల విద్యార్థులతో పాటు ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, రాకమచర్ల సర్పంచ్ పెంటన్న, శ్రీను, మానయ్య, దర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

చేవెళ్ల: మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న ఢిల్లీలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజేశ్ పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో బుధవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుందన్నారు. జైపాల్, శ్రీకాంత్, నర్సింహ, అశోక్, సురేశ్, శివకుమార్, పాల్గొన్నారు.



సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!

పలు వార్డుల్లో పేరుకుపోతున్న చెత్త | ఇళ్ల మధ్యే పారుతున్న మురుగు | పట్టించుకోని అధికారులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్థంగా తయారైంది. మున్సిపాలిటీ ఏర్పాటై ఐదున్నర సంవత్సరాలు గడుస్తున్నా పనుల నిర్వహణలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో పలు వార్డులకు వెళితే అంతే సంగతులు. ఎక్కడ చూసినా చెత్తా, చెదారం పేరుకపోయి దర్శనమిస్తాయి. మురుగు కాలువలు బురుద మయంగా తయారయ్యాయి. అక్కడక్కడ మురుగు పారుతున్న రోడ్లు దర్శనం ఇస్తాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్య పనుల్లో ఎటువంటి మార్పు రావడం లేదు. పట్టణ కేంద్రంలోని ప్రధాన కూడల్లో చెత్త వేస్తుండటంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా బోర్డులను ఏర్పాటు చేశారు. 'ఇచ్చట చెత్త వేయరాదు..చెత్త వేసినచో రూ.1,500 నుంచి 5,000వరకు జరిమానా' విధిస్తారని హెచ్చరికల బోర్డులను అధికారులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ రోడ్డు ప్రక్కనుంచి వెళితే ఠక్కున ముక్కున వేలేసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కాగా శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో రోజురోజుకు తీయాల్సిన చెత్తను సక్రమంగా సేకరించడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. దీంతో కాలనీల్లో ప్రజలు ఇష్టానుసారంగా చెత్తను రోడ్లపై వేస్తున్నారని కొందరు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరించి డంపింగ్‌యార్డుల్లో వేస్తే కొంత వరకైనా పారిశుద్ధ్యం మెరుగు పడుతుంది. మున్సిపల్ పరిధిలోని భవానీ నగర్, వెంకటేశ్వర కాలనీ, క్రెస్టల్ వెంచర్‌లో ఇళ్ల మధ్య మురుగు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా సంగారెడ్డి రోడ్డులోని నేషనల్ దాబా ప్రక్కన మురుగుచేరి అక్కడ ఉన్న స్థానికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గణేశ్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్య ఓపెన్ డ్రైన్ ఉండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాలువ నుంచి వచ్చే దుర్వాసన, దోమలతో ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని కాలనీల్లో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. అక్కడ విషపురుగులు తిరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పారిశుద్ధ్య సమస్య తీవ్రం కావడంతో ఆయా కాలనీల ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు శంకర్‌పల్లి మున్సిపల్‌పై దృష్టి సారించి పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



భవానీనగర్ వేంకటేశ్వర కాలనీల్లో చేరిన మురుగు

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



ఇళ్ల మధ్య మురుగు నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందిగా మారింది. మురుగు కాలువ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

-సుధాకర్‌రెడ్డి, క్రెస్టల్ వెంచర్

దుర్వాసన వెలువడుతోంది



వేంకటేశ్వర కాలనీలో ఇళ్ల మధ్య మురుగు నీరు చేరడంతో తీవ్ర దుర్వాసనలు వెదజల్లు తుంది. రాత్రి సమయంలో దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేసినా తమకేమి సంబంధం లేనట్టు వారి తీరు ఉండడం బాధకరం.

- గోపాల్‌రెడ్డి, వేంకటేశ్వర కాలనీ

చర్యలు తీసుకుంటాం



క్రెస్టర్ వెంచర్‌లో ఇళ్ల మధ్య చేరిన మురుగు నీటిని శుభ్రం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. మురుగును తొలగించే గల్పర్ మిషన్ అందుబాటులో లేనందున పనుల్లో ఆలస్యం జరిగిందన్నారు. కాగా కాలనీలోని అండర్‌డ్రైనేజీ మరమ్మతుల కోసం కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. జ్ఞానేశ్వర్, కమిషనర్, శంకర్‌పల్లి

పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి పెట్టండి

క్రీడ డైరెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సింగ్

షాబాద్: రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని క్రీడ డైరెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సింగ్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని రేగడిదోస్వాడ, ముద్దెంగూడ గ్రామాల మహిళ రైతులకు క్రీడ కృషి విజ్ఞాన కేంద్రం సహకారం సేవా స్ఫూర్తి దారుల సంఘం ఆధ్వర్యంలో కోడి పిల్లలను, దాణ పంపిణీ చేశారు. షెడ్యూల్ కులాలకు చెందిన కుటుంబాలకు కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుక బడిన కులాలకు ఆర్థిక స్వావలంభనకు అదనపు ఆదాయం ఆర్జించడం కోసం పెరటి కోళ్లను పంపిణీ చేశామన్నారు. రైతు కుటుంబాలకు కోడి పిల్లలు, దాణ అందజేశామన్నారు. గ్రామాల్లోని రైతులు పెరటి కోళ్ల పెంపకాన్ని చేపట్టాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉచితంగా ఒక్కో రైతుకు 20 కోడిపిల్లలు, 10కిలోల దాణా అందిస్తుందన్నారు. ఒక్కో యూనిట్ ధర సుమారు రూ.1,500 వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన వాస్తవేత్త రమణ, విజయ్ కుమార్, రామకృష్ణ, శ్రీకృష్ణ, సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం డైరెక్టర్‌లు లింగం, మల్లారెడ్డి, అంజయ్య, నర్సింహా, మహిళ రైతులు తదితరులు పాల్గొన్నారు.



కోడి పిల్లలు పంపిణీ చేస్తున్న వినోద్‌కుమార్ సింగ్

జీపీ భవనం ప్రారంభం

కేశంపేట: పాపిరెడ్డిగూడ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో రూ.25 లక్షలతో పంచాయతీ భవనం నిర్మించారు. ఈ భవనాన్ని తన పదవి కాలం ముగిసేలోగా ప్రారంభించాలని పట్టుదలతో భవన నిర్మాణ పనులను చేపట్టారు. బుధవారం సర్పంచులకు చివరి రోజు కావడంతో జీపీ భవనాన్ని ప్రాంభించేందుకు సర్పంచ్‌తో పాటు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు మండల ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు వారు ముందస్తుగానే తెలిపారు. గ్రామ పంచాయతీ భవనం ప్రారంభానికి గ్రామస్తులు ఉదయమే అక్కడికి చేరుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన సమయానికి రాకపోవడంతో అందరూ కొద్దిసేపు ఎదురుచూశారు. ఎమ్మెల్యే అనివార్య కారణాల వల్ల రాలేకపోతున్నానని సమాచారం ఇవ్వడంతో వెంటనే సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి కొందరు వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఉదయం నుంచి ఎదురుచూసిన అధికారులు వెళ్లిపోయిన తర్వాత సాయంత్రం భవనం ప్రారంభించుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుజ్జి రాంచందర్ నాయక్, నరేందర్‌జీ, రాఘవేందర్, దేవేందర్, శంకర్, రాంచందర్ నాయక్, తాండ్ర హర్షవర్ధన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జమున, బాలమణి తదితరులు పాల్గొన్నారు.



జీపీ భవనం ప్రారంభిస్తున్న సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రశాంతిరెడ్డి, అవినాశ్‌రెడ్డి, సర్పంచ్ రమ్య, ఎంపీటీసీ లత

షాబాద్: మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యమని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని చిన్న సోలిపేట్ గ్రామంలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు సర్పంచ్ రమ్య రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ మావిడి లత మహిపాల్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, ఎంతఓ శంకర్‌రాథోడ్, మాజీ ఎంపీటీసీలు గోపాల్, శంకర్, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు కుమార్, చిట్టి, చంద్రమ్మ, మునీమోహన్‌రెడ్డి, మల్లమ్మ పెరోజ్, బీఆర్‌ఎస్ నాయకులు రాంచంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హైమాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట



ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, తపాలా కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ఇందుకు గాను ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించనుందని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ..

గంట్లవెల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని అన్నారు. వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం మహనీయుడు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ బార్గవ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సర్పంచ్ నర్సింలు, శివారెడ్డి, ఎంపీటీసీ బొమ్ము అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

షాద్‌నగర్: పట్టణంలోని 19వ వార్డులో పిట్టల రమేష్ ముదిరాజ్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ముదిరాజ్ సంఘం నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం రూ.11వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో అంచ రాజు, మంగ మధు, అందె మోహన్, కావలి భాస్కర్, నరేందర్ పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న నాయకులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండల పరిధిలోని వెంకటాపూర్, చాకలిగూడ, కపిల్ ఆగ్రో ఫామ్స్, కనక మామిడి గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బానోతు హమునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా కపిల్ ఆగ్రో ఫామ్స్ ఫీడర్, వెంకటాపూర్ ఫీడర్, కనకమామిడి ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కిరాణా దుకాణంలో చోరీ

రూ.20 వేలు ఎత్తుకెళ్లిన దుండగులు

కొత్తూరు: కిరాణా దుకాణంలో షెటర్‌ను పగుల గొట్టి గుర్తు తెలియని దుండగులు రూ.20వేలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత జాతీయ రహదారిలో హరిఓం అనే వ్యక్తి తన పేరుతో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి షెటర్ పగులగొట్టి, పైకి లేపి ఉండడాన్ని అతను గమనించాడు. అతడు లోపలికి వెళ్లి చూసే సరికి రూ.20 వేలు అపహరించినట్లు గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం చేరవేశాడు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

– పశువైద్యాధికారి దేవిరెడ్డి

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో పెరిగిపోతున్న వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని మండల పశు వైద్య అధికారి దేవిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వీధి కుక్కల పట్ల పలు జాగ్రత్తలు, జంతువుల సంరక్షణకు తీసుకోవలసిన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ చూసిన వీధి కుక్కల బెడద పెరిగిపోతుందని తెలిపారు. ఈ క్రమంలో అవి పిల్లలను పట్టి కరుస్తున్నాయని సూచించారు. వాటి విషయంలో చిన్న పిల్లలు రోడ్డుపై నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అమ్డాపూర్ పశు వైద్య అధికారి అమద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దేవిరెడ్డి

దాతల సహకారం మరువలేనిది

సర్పంచ్ లక్ష్మీసత్యనారాయణ

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందించే సహకారం మరువలేనిదని సర్పంచ్ చాకలి లక్ష్మీసత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజని పేర్కొన్నారు. బుధవారం న్యాలట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో దాతలు మూడి మ్యాల, పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్ అతని స్నేహితులు వియజ్‌కాంత్‌రెడ్డి, అభినందన్‌రెడ్డి బాత్ రూమ్ మరమ్మతు పనులను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి శేఖర్ ద్వారా విషయం తెలుసుకొని తాము పనులు చేయించామన్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకురావాలన్నారు. ప్రతిఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలని వా రు కోరారు. అనంతరం వారిని సర్పంచ్, ఉపాధ్యాయులు పాఠశాలలో సన్మానించి అభినందించారు. ఈకార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, సంతోష్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



మొయినాబాద్ రూరల్: సర్పంచ్ శోభావెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు



కొందుర్గులో సర్పంచులను సన్మానించిన నాయకులు, అధికారులు

సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్/కొందుర్గు: గ్రామాలను అభివృద్ధి చేయడంలో సర్పంచులు కీలక పాత్ర వహించారని సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సర్పంచులుగా ఎన్నికై 5సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేతిరెడ్డిపల్లి గ్రామంలో పలు యువజన సంఘాలు, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు దారెడ్డి శోభకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా దారెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి సర్పంచులతోనే జరిగిందని తెలిపారు. అనంతరం సర్పంచ్ శోభా మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సిద్ధయ్య, ప్రశాంత్‌రెడ్డి, శివారెడ్డి, వంశీరెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ముజాఫర్, కరుణాకర్, జంగయ్య, మున్ను, పాల్గొన్నారు.



చేవెళ్ల: మల్కాపూర్‌లో సర్పంచ్ శేరి శివారెడ్డి, ఉప సర్పంచ్ జాఫర్, వార్డు సభ్యులకు సన్మానం

మల్కాపూర్‌లో..

గ్రామ అభివృద్ధి పాలకవర్గం సభ్యులతోపాటు ప్రజల సహకారంతోనే సాధ్యమైందని మల్కాపూర్ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శేరి శివారెడ్డి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ వద్ద పంచాయతీ పాలకవర్గం 5ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకవర్గం సభ్యులతో పాటు ఉప సర్పంచ్ జాఫర్, వార్డు సభ్యులందరినీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శేరి శివారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లు ప్రజలు గ్రామ అభివృద్ధికి సహకారం అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు మండలపరిషత్ కార్యాలయంలో..

కొందుర్గు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య అధ్యక్షతన మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులను శాలువా కప్పి, పూల మాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం అడ్డుకోవడం బాధాకరం

తెలంగాణ జన సమితి నాయకులు

చేవెళ్ల: గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా నియమించాలని ప్రకటిస్తే బీఆర్‌ఎస్ నాయకులు కోర్టు ద్వారా అడ్డుకోవడం బాధాకరమని తెలంగాణ జన సమితి నాయకులు పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తాలో బుధవారం నల్లరిబ్బన్‌లు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు కుంట్ల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారాన్ని అడ్డుకునేందుకు కేసీఆర్, కేటీఆర్‌ల కుట్రను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. తెలంగాణ సాధనలో ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం చేసిన సేవలను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో తగిన గుర్తింపు ఇస్తే దాన్ని అడ్డుకోవడం వారి నియంత పోకడలకు నిదర్శనమన్నారు. ఇప్పటికై నా బీఆర్‌ఎస్ నాయకులు తీరు మార్చుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, సత్యనారాయణ, శివకుమార్, రవికృష్ణ చారి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను అవమానించినట్లే..

ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరాం ప్రమాణస్వీకారాన్ని అడ్డుకోవడమంటే ఉద్యమకారులను అవమానించినట్లేనని ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు కరికే మల్లేశ్‌లు పేర్కొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ జన సమితి నాయకులు